క్లుప్తంగా

పంట కాలువల్లోకి ఆక్వా చెరువుల నీరు వదిలితే చర్యలు



కోలనపల్లిలో పంటకాలువలోకి నీరువస్తున్న దారిని మూయించి వేస్తున్న మత్స్యశాఖ అధికారులు

కాళ్ల: పంటకాలవల్లోకి ఆక్వా చెరువుల నీరు వదిలితే చర్యలు తప్పవని కాళ్ల ఎఫ్‌డీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. కాళ్ల గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సోమవారం మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట కాలవలోకి నీరు వస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి నీరు వచ్చే మార్గాన్ని పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ ఆక్వా సాగుదారులు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సంబంధిత ఆక్వా చెరువుల యాజమాన్యంతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ సత్యనారాయణ, పలువురు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు అభయ లయన్స్‌క్లబ్ ప్రమాణ స్వీకారం

ఆకివీడు: ఈ నెల 5వ తేదీన అభయ లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం చేయనుందని నగర పంచాయతీ కో ఆప్షన్ సభ్యులు, క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన ఎండీ.జక్కీ చెప్పారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 316 మల్టీపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, మల్టీపుల్ కౌన్సిల్ మాజీ చైర్‌పర్సన్ చిలువూరి కృష్ణంరాజు, గౌరవ అతిథులుగా లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ. సూర్యనారాయణరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు హాజరవుతారని తెలిపారు. ప్రత్యేక అతిథులుగా దాట్ల రామరాజు, పల్లి రంగారెడ్డి హాజరవుతారని చెప్పారు. క్లబ్ అధ్యక్షుడితో పాటు కార్యదర్శిగా కె.వెంకటరత్నం, కోశాధికారిగా జీ.వీర కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారని జక్కీ వివరించారు.

జూదరుల అరెస్ట్

భీమవరం అర్బన్ : భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడేరులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం తెలుసుకుని ఎస్సై బి.మోహన్‌రావు సోమవారం తన సిబ్బందితో దాడి చేశారు. 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 6 ద్విచక్ర వాహనాలు, 6 సెల్ ఫోన్లు, రూ. 2,320 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మోహన్‌రావు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

పాలకోడేరు: పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న సంఘటన ఇది. మోగల్లు పంచాయతీ పరిధిలోని గుత్తుల వారి పాలెంలో పేకాట ఆడుతుండగా ఎస్సై నాళం శ్రీనివాసరావు తన సిబ్బందితో దాడి చేసి నలుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 1200 నగదు స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి భీమవరం కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ధర్మకర్తల మండలి సభ్యులు

భీమవరం (ప్రకాశంచౌక్) : రెండవ పట్టణంలో వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం,(సుబ్బారాయుడి గుడి) పునర్నిర్మాణానికి ప్రభుత్వం కామన్ గుడ్ ఫండ్ నుంచి రూ 1.50 కోట్ల నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి సోమవారం సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంటున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి , దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా, వారు వెంటనే స్పందించి రూ.1.50 కోట్ల నిధులను మంజూరు చేశారని చెప్పారు. త్వరలోనే ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు నిమ్మల బాలసుబ్రహ్మణ్యం, కోరాసిక లక్ష్మీనారాయణ, యలకల దాల అప్పన్న, వేంద్ర లక్ష్మి, ఉయ్యూరి సత్యవతి, ధనాల లక్ష్మి, గుండు రమణ, గుండు సోమనాథం, అర్చకులు మొవ్వ శంకర్, ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ కృష్ణంరాజు పాల్గొన్నారు.

సాహితీ ప్రపంచానికి వెంకటావధాని స్ఫూర్తి ప్రదాత

ఆచార్య దివాకర్ల 112వ వెంకటావధాని జయంతి



యండగండిలో వెంకటావధాని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: అవధాన ప్రక్రియకు ఆద్యులు, తెలుగు సాహితీ ఉద్యమానికి ప్రాణం పోసిన, దివాకర్ల తిరుపతి శాస్త్రి, వెంకటావధని స్వగ్రామం యండగండి కావటం సాహితీ ప్రపంచంలో ఆ గ్రామం ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నదని కవి పండితులు, ఇందుకూరి లక్ష్మీపతి రాజు అన్నారు. తెలుగు సాహిత్య ఉద్యమానికి జీవిత కాలమంతా సేవలందించిన, కేంద్ర సాహిత్య అకాడమీ పూర్వపు సభ్యులు ఆచార్య దివాకర్ల వెంకటావధాని 112 వ జయంతి కవి స్వగ్రామం యండగండి గ్రామంలో దివాకర్ల సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, కవి పండితులు, అవధాని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దివాకర్ల సాహితీ సంస్థ అధ్యక్షులు చెరుకువాడ అప్పల రామకష్ణ వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పండితులు ఇందుకురి లక్ష్మీపతి రాజు మాట్లాడుతూ తిరుపతి శాస్త్రి వెంకటావధానీ సాహితీ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాతలనీ పేర్కొన్నారు. తమ సాహిత్యం సామాన్యుడి సైతం పరవశించిపోయేలా సాహితీ మాధుర్యాన్ని, ఫలాలని సామాన్యులకు అందించిన మహనీయులు వెంకటావధాని తిరుపతి శాస్త్రి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేగేశ్న రామరాజు, ఎండగండి కోపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ కన్నా శివన్నారాయణ, సిహెచ్ బంగారరావు, టి.సూర్యచంద్రరావు, మాటూరి భాస్కర్ గుప్తా, అధ్యాపకులు వరలక్ష్మి, రుద్రరాజు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎండగండి సహకార సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు బహూకరించారు.

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



ఎస్వీ రంగారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : విశ్వ విఖ్యాత, నటసార్వభౌమ ఎస్వీ రంగారావు జయంతి కార్యక్రమాన్ని అంకాల ఆర్ట్స్ అకాడమీలో కళా సంస్థల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోపా సత్యనారయణ, కళారంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలపాటు మూడొందల చిత్రాలకు పైగా అద్భుతంగా నటించి, తెలుగు ప్రేక్షకుల జ్ఞాపకాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన నట చక్రవర్తి ఎస్వీ రంగారావు అని అన్నారు. నేటికీ ఘటోత్కచుడు, కీచకుడు, రావణాసురుడు పాత్రల్లో టక్కున గుర్తొచ్చే పేరు ఎస్వీ రంగారావుదే అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ ఇన్ని దశాబ్దాలు దాటినా ఆయన లేనిలోటు ఎవరూ పూడ్చలేకపోయారని అన్నారు. కళాకారుల సంఘం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎస్వీ రంగారావుకు పద్మశ్రీ ఇవ్వకపోవడం శోచనీయమని, ఇప్పటికైనా ప్రభుత్వం పద్మశ్రీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చిరుపవన్ తేజం అధ్యక్షులు ఉండపల్లి రమేష్ నాయుడు, గురజాడ కళానికేతన్ నాయకులు చుక్క నశ్రీ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నున్న ఆంజనేయులు, పి నిర్మల, వరలక్ష్మి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వీరవాసరం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని శెట్టిబలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వీరవాసరం తులసి కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన శెట్టిబలిజ సంఘ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ, శెట్టిబలిజలతో పాటు అన్ని కులాలతోనూ సోదర భావంతో కలిసిమెలిసి జీవించడం ఈ ప్రాంతవాసులకు అలవాటు అన్నారు. కలిసిమెలిసి జీవిస్తున్న గౌడ శెట్టిబలిజను కలుపుతామని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. కులాల మధ్య కుంపటి రాజేస్తున్న పవన్ కళ్యాణ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం , బీసీ సెల్ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, వీరవల్లి శ్రీనివాసరావు, ఇళ్ల శ్రీనివాసరావు, డీవీడీ ప్రసాద్, కడలి శ్రీరాములు, బండి బాలాజీ, మల్లుల పాటియా, గుడాల రవికుమార్, గుబ్బల సత్యనారాయణ, కవురు దిలీప్, శెట్టిబలిజ సంఘం నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో...



శాకంబరీ అలంకరణలో శ్రీ పార్వతీ సమేత శక్తీశ్వర స్వామి

భీమవరం అర్బన్ : గురుపౌర్ణమి పురస్కరించుకుని యనమదుర్రు గ్రామంలోని శ్రీ పార్వతి సమేత శక్తీశ్వరస్వామిని శాకంబరీ అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో స్వామివార్లను అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పనసకర్ల మురళీకృష్ణ, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాయిబాబా ఆలయాలలో ప్రత్యేక పూజలు

గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని గొల్లవానితిప్ప, దొంగపిండి, కొత్తపూసలమర్రు, చినఅమిరం, రాయలం తదితర గ్రామాలలో సాయిబాబా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా గురుపౌర్ణిమ పూజలు

కాళ్ల: గురు పౌర్ణిమ పురస్కరించుకొని సోమవారం సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా సీసలి, పెదఅమీరం, దొడ్డనపూడి గ్రామాల్లో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు బాబా వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీసలి గ్రామంలోని సాయి బాబా ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి పర్యవేక్షించారు.

స్పందనకు ఐదు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు బదలాయించామన్నారు. ఆయా శాఖల అధికారులు విచారణ చేపడతారని వివరించారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఏపీఎం నాగభూషణం నాయుడు, హౌసింగ్ ఏఈ భాస్కరరాజు, పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

పాలకోడేరు: ప్రభుత్వ పథకాలు అన్నీ నూరు శాతం అర్హులైన వారికి దక్కాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందని పాలకోడేరు ఎంపీడీవో నూకల మురళి గంగాధర్ రావు పేర్కొన్నారు. ఈ పథకం కిందద కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పట్టాధారు పాస్ పుస్తకాల్లో మ్యుటేషన్, తప్పులు సరిదిద్దుట, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, ఆధార కార్డ్ నందు మొబైల్ నంబర్ నమోదు, కౌలు రైతు కార్డ్, రేషన్ కార్డ్‌లో కుటుంబ సభ్యుల నమోదు, తొలగించుట.. ఈ సేవలన్నీ ఉచితంగా చేస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చంటీరాజు కోరారు.

నేడు చినకాపవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆకివీడు: చినకాపవరం గ్రామంలో మంగళవారం 3వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కందుల వాణి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలోని మహాలక్ష్మీపురం, రాజులపేట, గంగాదేవి కోడు, బంగ్లా ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

కరుణించిన వరుణుడు

ఆకివీడు: వరుణుడు కరుణించడంతో ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో పాటు కొద్దిసేపు భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల రహదారులు జలమయమయ్యాయి. ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడటంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పొడిబారిన పంట పొలాలు భారీ వర్షానికి తడవడంతో దమ్ము పనులకు పలు చోట్ల అవకాశం ఏర్పడుతుందని రైతులు ఆనందిస్తున్నారు.

భీమవరం అర్బన్ : భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప, యనమదుర్రు, దిరుసుమర్రు, రాయలం, అనాకోడేరు, కొమరాడ, బేతపూడి, తాడేరు, వెంప, తుందుర్రు గ్రామాలలో సోమవారం సాయంత్రం రెండుగంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

బాలల్లో అల్లూరి ఆశయ స్ఫూర్తిని నింపాలి

భీమవరం (ప్రకాశంచౌక్) : బాల బాలికల్లో అల్లూరి సీతారామరాజు ఆశయ స్ఫూర్తిని నింపాలని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అన్నారు. 34వ వార్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శ్రీవిజ్ఞానవేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమైఖ్య అధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నడింపల్లి వెంకటపతిరాజు మాట్లాడుతూ మన్యం ప్రాంతంలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహోన్నత వ్యక్తి అల్లూరి అని అన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు సత్యవాణి, కరుణమ్మ, ఐశ్వర్య, కళ్యాణి పాల్గొన్నారు.





టెండరు - కం- బహిరంగ వేలం ప్రకటన

క్ర.సం.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	వేలం జరుగుతుంది తేది, సమయము
1.	[illegible]	[illegible]	01.08.2023 నుండి 31.07.2025 వరకు	రూ. 10,000/-	11.07.2023 [illegible] 10.30 [illegible]
2.	[illegible]	[illegible]	[illegible]	రూ.1,00,000/-	11.07.2023 మంగళవారము ఉదయం గం .11.00 ల నుండి

[illegible] 03.07.2023

మంతెన [illegible] రాజు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

వీరవాసరం : మండలంలోని పలు కుటుంబాలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. వీరవాసరం మాజీ జెడ్పీటీసీ పోలిశెట్టి సత్యనారాయణ సోదరుడు పోలిశెట్టి వీర రాఘవులు (చంటబ్బాయి) ఇటీవల మరణించడంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా వీర రాఘవులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తర పాలెంలో పార్టీ నాయకులు కోడే అప్పారావు సతీమణి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే గవర పాలెంలో పార్టీ నాయకులు కె.రవికుమార్ తల్లి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ సలహా మండల చైర్మన్ గొలగాని సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణ, నాయకులు నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, గద్దం భాస్కర్ రావు, పోలిశెట్టి సత్యప్రసాద్, పోలిశెట్టి నాగమల్లేశ్వరరావు, శివనారాయణ పాల్గొన్నారు

ఆందోళన వీడితే ఆరోగ్యం



పాలకోడేరు పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సీహెచ్ రంగమ నాయుడు

పాలకోడేరు: ఒత్తిడి మనిషిని మానసికంగా కుంగదీస్తుంది. రోగాలబారిన పడేస్తుంది. ఇంటిని, బయట పనులను చక్కదిద్దే మహిళలు ఎక్కువ ఒత్తిడికి లోనవుతుంటారు. దాని కారణంగా బీపీ రావడంతో పాటు గర్భధారణలో అనేక సమస్యలు తలెత్తుతాయి. నిద్రలేమి, ఆకలి లేకపోవడం, కొన్నిసార్లు గర్భస్రావం అయ్యే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇటువంటి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించింది. మాతా శిశు మరణాలు పూర్తిగా అరికట్టేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎన్నో సంస్కరణకు శ్రీకారం చుట్టింటి. ప్రతి నెలా 9న ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన (పిఎంఎస్ఎంఎ) ద్వారా ప్రత్యేక చికిత్సలు నిర్వహిస్తూ తల్లీబిడ్డల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా గర్భిణులు ఒత్తిడిని ఎలా అధిగమించాలో ఆస్పత్రుల్లోనే అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గంలో పాలకోడేరు, ఆకివీడు, ఉండి కాళ్ల మండలాల్లో 1534 మంది గర్భిణులు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, ప్లస్, పోర్టిఫైడ్ బియ్యం, కోడిగుడ్డు, పాలు, బెల్లం, కర్జూరం, ఆయిల్, రాగిపిండి, పాలు లాంటి పోషకాలు కలిగిన ఆహారం అందిస్తోంది.

గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గర్భిణులు తొలి ఐదు నెలలు అత్యంత జాగ్రత్తలు పాటించాలి. ఎక్కువ బరువులు ఎత్తకూడదు. ఆందోళన పడకూడదు. ఒత్తిడి లేకుండా ఉండాలంటే నలుగురితో మాట్లాడుతూ ఉండాలి. తగినంత నిద్రపోతూ ఉండాలి. ఎప్పుడు నవ్వుతూ ఉండాలి. సరైన ఆహారం తినాలి. వ్యాయామం చేయాలి.

అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు ఒత్తిడిని ఎలా అధిగమించాలో ప్రభుత్వాసుపత్రుల్లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. డాక్టర్లు పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు , ఆశాలు అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణుల ఆరోగ్యంపై ఆరా తీస్తుంటారు. ప్రతి నెలా 9న ఆస్పత్రిలో గిర్భిణులకు మాతృత్వ సురక్ష అభియాన్ యోజన ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించి, కాన్పు జరిగే వరకూ పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పిస్తున్నాం.

చినమిల్లి రంగమ నాయుడు,
పీహెచ్‌సీ వైద్యాధికారి, పాలకోడేరు



